సాక్షి సంగారెడ్డి

నాట్లు వేస్తున్న మహిళలు





తట్టు సంచి ద్వారా మడులకు తరలిస్తున్న నారు

నారు మోసి.. నాట్లు వేసి

జిల్లాలో యాసంగి పనులు జోరందుకున్నాయి. సంగారెడ్డి, శివ్వంపేట శివారులలో రైతులు ముందస్తుగా నార్లు పోసి.. పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఎక్కడ చూసినా వరినాట్లు వేస్తూ కూలీలు బిజీబిజీగా గడుపుతున్నారు. తట్టు సంచి, గంపల ద్వారా నారును మోస్తూ మడులకు చేరుస్తున్నారు. మహిళలు హుషారుగా పాటలు పాడుతూ నాట్లు వేస్తున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

జాతీయ స్థాయికి ఎంపిక



విద్యార్థి నందిని

కొండాపూర్ (సంగారెడ్డి): మండల కేంద్రమైన కొండాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థి నందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నందిని వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ప్రతిభచాటి స్వర్ణ పతకం గెలుచుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆమె ఈ నెల 12 నుంచి పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి ముస్కాన్ సైతం వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో సత్తాచాటి కాంస్య పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ పాండును పాఠశాల బృందం అభినందించింది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాలు

నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ, మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో ఆయా శాఖల అధికారులకు ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు సకాలంలో అందని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలో మంగళవారం కార్మికులు, రైతు కూలీలతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామీణ బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కేంద్రం తీరును నిరసిస్తూ ఈ నెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రం కార్మికుల హక్కులను కాలరాస్తూ పెట్టుబడి దారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్, నర్సింహులు, శ్రీను, సురేష్, చంద్రయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

సీఎంను దూషించడం సరికాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్ : సీఎం రేవంత్‌ను దూషించడం సరికాదని, బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారి పై రాస్తారోకో నిర్వహించి, బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, సామయ్య పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి తోడ్పాటు



మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్ కుమార్

సంగారెడ్డి అర్బన్: ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించడమే కాకుండా, వారి అభ్యున్నతికి కృషి చేయాలని డీఎస్పీ రమేష్ కుమార్ సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం తార డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై డీఎస్పీ మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వారిని లైంగిక వేధింపులకు గురిచేస్తే పోక్సో చట్టం కింద నేరంగా పరిగణించబడుతుందని, దీనికి బెయిల్ కూడా మంజూరు కాదని వివరించారు. అనంతరం గేమ్స్, సాహిత్య అంశాలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ నాగలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ దేవలక్ష్మి, పల్లవి, విశాల పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా..



పల్లెల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

- నేటి నుంచి 15వరకు కార్యక్రమాలు
- క్షేత్రస్థాయిలోకి ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు
- సమస్యల గుర్తింపు.. పరిష్కారంపై దృష్టి

పల్లెల్లో పారిశుద్ధ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రజారోగ్యమే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రతీ ఊరును పరిశుభ్రంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది.

– నారాయణఖేడ్

జిల్లా వ్యాప్తంగా 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ పంచాయతీలో ఈనెల 7వ తేదీ నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవడంతో వారి స్థానంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. మారుమూల గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. వీటిల్లో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం కలెక్టర్ క్రాంతి కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య డ్రైవ్‌పై దిశానిర్దేశం చేశారు. పనితీరు ఆధారంగా ఉత్తమ పంచాయతీలకు ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

◆ మొదటి రోజు బుధవారం గ్రామ సభ నిర్వహించాలి. మహిళా, యువజన సంఘాలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఇతర గ్రామస్థాయి అధికారులను ఆహ్వానించి ప్రత్యేక అధికారుల పాలన గురించి వివరించాలి.

◆ గ్రామసభ ద్వారా శానిటేషన్, తాగునీటి సరఫరా, ఇతర సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలి.

◆ మహిళా సంఘాల సభ్యులతో రంగోలి కార్యక్రమం నిర్వహించాలి.

◆ యువత, మహిళలు, అధికారులతో శ్రమదానం , తడి, పొడి చెత్త వేరుచేయడం, రోడ్లపై గుంతలను పూడ్చడం, జాతీయ రహదారుల రోడ్లపై చెత్తకుప్పలు, మట్టి దిబ్బలు తొలగించాలి.

◆ వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలు, ఇతర కమ్యూనిటీ ప్రాంతాల్లో కలుపు మొక్కలు, పొదలను ఉపాధి కూలీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించాలి.

◆ పడిపోయిన మొక్కలు సరిచేయడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటడం, నీరు పోయడం, ప్రతీ గృహంలో డ్రైడే పాటించేలా అవగాహన, గ్రామ నర్సరీని ప్రత్యేక అధికారి విధిగా విజిట్ చేయాలి.

◆ అంగన్‌వాడీ, పంచాయతీ భవనం, వాటర్ ట్యాంకులు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఇతర భవనాలు, ఖాళీ ప్లాట్ల వద్ద చెత్త తొలగింపు.

◆ గ్రామంలోని తాగునీటి ట్యాంకులు శుభ్రపర్చడం, పైపులైను లీకేజీలకు మరమ్మతు చేయడం.

◆ తాగునీరు వృథా అరికట్టడానికి ప్రతీ గృహానికి ఆన్ ఆఫ్ స్విచ్‌లు బిగించడం, ట్యాంకులో తగిన మోతాదులో క్లోరినేషన్ చేయడం, బహిరంగ ప్రదేశంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, ఆయిల్ బాల్స్ తయారీ చేసి నీరునిల్వ ఉన్న ప్రదేశాల్లో వేయడం.

◆ దోమల మందు పిచికారీ, పాడైన బోర్లు, బావులు పూడ్చడం, వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకునేలా చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మించడం.

◆ మురికి కాల్వల శుభ్రం, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా అవగాహన, పాఠశాలలు, దేవాలయాలు, షాపులు, హోటళ్లలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా వేయడం.

◆ యువత క్రీడాపోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం, మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించడం, గ్రంథాలయం ఏర్పాటుకు తగిన స్థలం గుర్తింపు.

◆ ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీగా ర్యాలీ, పారిశుద్ధ్య వారోత్సవాల్లో బాగా పనిచేసిన మల్టీ పర్పస్ వర్కర్, యువజన, మహిళా సంఘాలు, పంచాయతీ కార్యదర్శికి సన్మానం.

స్పెషల్‌డ్రైవ్‌కు సిద్ధం



గ్రామాల్లో 7వ తేదీ నుంచి నిర్వహించనున్న స్పెషల్‌డ్రైవ్‌కు సిద్ధమయ్యాం. ఇందుకోసం జిల్లా ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో కార్మికులతో రోజువారీ కార్యక్రమాలు చేపడుతాం.

– యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, హంగిర్గా(బి)

అన్ని పంచాయతీల్లో స్పెషల్‌డ్రైవ్



జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వారం రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతాయి. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఇదివరకే శిక్షణ ఇచ్చాం. నేటి నుంచి కార్యక్రమాలను ముమ్మరంగా చేపడతాం.

– సురేష్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి

స్వల్ప భూకంపం

ఇళ్ల నుంచి జనం పరుగులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలో మంగళవారం రాత్రి మళ్లీ స్వల్పంగా భూకంపం వచ్చింది. మిర్జాపూర్(ఎస్) ముంగి, టేకూర్, న్యాల్‌కల్, తదితర గ్రామాల్లో సాయంత్రం 8 గంటల ప్రాంతంలో కొన్ని క్షణాలపాటు భూమి కంపించింది. పెద్ద శబ్దాలు రావడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. గత నెల 27వ తేదీన స్వల్పంగా భూమి కంపించిన విషయం తెలిసిందే. 9 రోజుల తర్వాత మళ్లీ అలా జరగడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపనాలకు గల కారణాలను అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

రేపు సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

పటాన్‌చెరు టౌన్: జిల్లా కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 8న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి ముక్తార్, ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎంపిక జరుగుతుందని, పాల్గొనే క్రీడాకారులు 55 కిలోల బరువులోపు, వయసు 16 ఏళ్ల లోపు ఉండాలన్నారు. వెంట స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాలో జరిగే 33వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. వివరాలకు 9666513305లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కమిషనర్‌ను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా వాటిల్లో రెండు వరుసల్లో మొక్కలు నాటాలని సూచించారు. అలాగే ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలన్నారు. రాజీవ్ పార్క్ అభివృద్ధికి అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. వంద శాతం పన్ను వసూళ్లు కావాలని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

అంగన్‌వాడీ పరిధిలో పోషక లోపం ఉన్న పిల్లలపై దృష్టి సారించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. కలెక్టర్‌లో మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఓల్డ్ ఏజ్ హోమ్ పెండింగ్ పనులు నాణ్యతగా చేయాలన్నారు. అక్కడ అవసరమైన ఫర్నిచర్, బెడ్స్‌కు, ఖేడ్ బాలసదనంకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సంగారెడ్డి బాలసదన్ భవన నిర్మాణానికి వెంటనే టెండర్స్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. ప్రీ స్కూల్ విద్యను టైం టేబుల్ ప్రకారం బోధించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీడబ్ల్యూఓ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

బొల్లారం అభివృద్ధికి శ్రమిస్తా

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ చంద్రారెడ్డి



చంద్రారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించి మాజీ ఎంపీపీ వి.ప్రతాప్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వెయ్యి మంది కార్యకర్తలు, అభిమానులతో కలసి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌లు ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... 2014 నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నప్పటికీ తనకు ఏనాడూ సముచిత స్థానం లభించలేదన్నారు. బొల్లారం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు సంతోష, నిహారిక, జయమ్మ, గోపాలమ్మ, రాధ, కోఆప్షన్ సభ్యుడు మునీరు, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంపత్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు

సిద్దాపూర్‌లో అధికారులతో స్థానికుల వాగ్వాదం



సిద్దాపూర్ రోడ్డులో జేసీబీ సహాయంతో తొలగిస్తున్న ఆక్రమణలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. సిద్దాపూర్ గాని నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6.50 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ సెంట్రల్ మిడియాన్ పనులు జరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో 180 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆక్రమణదారులు పట్టించుకోలేదు. దీంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీర్ రాజేశ్, అధికారులు ఆక్రమణల తొలగింపును ప్రారంభించారు. ఈ విషయంపై కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తొలగింపునకు ఒకరిద్దరు రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరారు.

భగీరథా.. ఏమిటీ వృథా

జహీరాబాద్: మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై వాటర్ పైప్‌నకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ దెబ్బతినడంతో అందులో నుంచి నీరు ఎగిసిపడుతోంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరారు.



వృథాగా పోతున్న నీరు

ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు



టర్బయిన్‌ల ద్వారా వదిలిన నీరు

పుల్‌కల్(అందోల్): ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేశారు. మూడు వేల ఎంసీఎఫ్‌టీల నీటిని జలవిద్యుత్ కేంద్రం ద్వారా వదిలారు. దీంతో జెన్‌కో అధికారులు టర్బయిన్‌ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ మంజీరాలోకి నీటిని వదులుతున్నారు. ఘనపూర్ ఆనకట్ట 1.5టీఎంసీల సామర్థ్యమే ఉండటం, సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలకు మించి ఉండటంతో దశల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. పంట పూర్తయ్యేనాటికి 8 దఫాలుగా వదులుతారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడు దశల్లో 0.9టీఎంసీల నీటిని వదిలారు. జలవిద్యుత్ కేంద్రంలో 0.4 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

ఎగిరొచ్చిన విదేశీ అతిథులు





చెరువులో సందడి చేస్తున్న విదేశీ కొంగలు

మిరుదొడ్డిలో సైబీరియన్ కొంగల సందడి వేసవి ప్రారంభంలోనే విదేశీ పక్షుల సందడి మొదలైంది. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పెద్ద చెరువు విదేశీ పక్షులకు విడిదిగా మారింది. దేశం కాని దేశాలు, ఖండాంతరాలు దాటి వస్తున్న సైబీరియన్ కొంగలు ఆహార అన్వేషణలో వలస వస్తున్నాయి. వేసవి చివరి వరకు ఇక్కడే ఉండి వర్షాకాలం వచ్చే లోపు తిరుగు ప్రయాణం కానున్నాయి. ఇప్పుడిప్పుడే చెరువులోకి వస్తున్న కొంగలను జనాలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – మిరుదొడ్డి(దుబ్బాక)

క్లుప్తంగా

మట్టి అక్రమంగా తరలిస్తే కేసులు

వట్‌పల్లి(అందోల్‌): మండల పరిధిలో జరుగుతున్న మట్టి దందాపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'యథేచ్ఛగా మట్టి తవ్వకాలు' శీర్షికకు అందోలు, జోగిపేట ఆర్డీఓ పాండు స్పందించారు. అనుమతులు లేకుండా మట్టి తరలింపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేయాలని తహసీల్దారు శ్రీనివాస్‌కు మంగళవారం ఆదేశించారు. మైనింగ్‌ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేనట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాక్షిలో కథనం రావడంతో అక్రమార్కులు మట్టి రవాణాను నిలిపివేశారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

టేక్మాల్‌ (మెదక్‌): అప్పుల బాధతో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన టేక్మాల్‌ మండలంలోని వెంకటాపూర్‌ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పరి అమృతి (45) ఈనెల 5న నార్సింగికి వెళ్లి వస్తానని బైక్‌ తీసుకొని వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. పొలం వద్ద అతని బైక్‌ వద్ద కనిపించింది వేప చెట్టుకు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు.

మల్లన్నసాగర్‌ పోరాటాల కేసుల కొట్టివేతపై హర్షం

గజ్వేల్‌రూరల్‌: మల్లన్నసాగర్‌ ప్రాజెక్టు కింద సర్వం కోల్పోతున్న భూనిర్వాసితుల తరఫున పోరాటాలు చేసిన వారిపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తే ఇటీవల సిద్దిపేట జిల్లా కోర్టు న్యాయమూర్తి వాటిని కొట్టి వేస్తూ తీర్పు నివ్వడం హర్షణీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

వట్‌పల్లి(అందోల్‌): అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని నాదులాపూర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి నల్లోళ్ల మొగులయ్య(65) గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెళ్లి చూస్తే అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

రీఫిల్లింగ్‌ చేస్తుండగా పేలిన సిలిండర్‌

నలుగురికి తీవ్ర గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌ లీక్‌ కావడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండల పరిధిలోని బొల్లారంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ నయీమొద్దీన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని పోచమ్మ బస్తీకి చెందిన పెంటారెడ్డి అదే కాలనీకి చెందిన బుచ్చయ్య ఇంటికి వెళ్లి పెద్ద సిలిండర్‌ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్‌ను రీఫిల్లింగ్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. ఈ ఘటనలో పెంటయ్య, బుచ్చయ్యతో హన్మంత్‌, అనసూయకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని సమీపంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరిని వదలని 'మొగి'

ఈ యాసంగి వరి సాగులో రైతన్న దిక్కు తోచని స్థితిలో పడ్డాడు. నాట్ల దశలోనే మొగి పురుగు ఆశించి కృంగదీస్తుంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పని చేయడం లేదని వాపోతున్నారు. నాటు దశలోనే సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అంత ఉధృతి ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఒకే రకమైన పంట సాగు చేయడం కూడా కారణమంటున్నారు. వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని పేర్కొంటున్నారు.

- నాటు వేసిన 15వ రోజు నుంచే పురుగు ఉధృతి
- ఎరబారి కుళ్లిపోతున్న పంట
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- దిక్కుతోచని స్థితిలో రైతన్న
- జిల్లాలో ఇప్పటివరకు 37 వేల ఎకరాల్లో సాగు


కన్‌సాన్‌పల్లి గ్రామంలో వరిపైరుకు ఆశించిన మొగి పురుగు

వట్‌పల్లి(అందోల్‌): భారీ వర్షాలతో వానాకాలం వరి పంట అన్నదాతకు నష్టాలనే మిగిల్చింది. వర్షం ఎక్కువ కురిసి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఎకరాకు.. ఒక రైతు ఐదారు వేల పెట్టుబడి నష్టపోయాడు. కాగా ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభిస్తే ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. గత యాసంగి తరహాలోనే ఇప్పుడు కూడా వరిని మొగి పురుగు ఆశిస్తోంది. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ఫలితం రావడం లేదని రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఎరబారి పిలకలు రావడం లేదు

జిల్లాలో ఈ యాసంగిలో 80 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 37 వేలకు పైగా ఎకరాల్లో నాట్లు వేశారు. ఈనెల రెండో వారం లోపు మరో 40 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా. అయితే మొగి పురుగు ఉధృతితో నాట్లు వేసిన పొలాలు ఎర్రబడి పోయి పిలకలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. క్రిమిసంహారక మందులను పిచికారీ చేసినా.. ఫలితం లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. ఒక్కో ఎకరాపై దుక్కి దున్నిన నాటి నుంచి మొదలుకొని, విత్తనాలు, నాట్లు వేసిన తర్వాత చల్లే మందు వరకు సుమారు రూ.25 వేలు ఖర్చు చేశారు.

పురుగు ఆశించడానికి కారణాలు..

ప్రస్తుత వాతావరణ మార్పులకు తోడు.. ముదిరిన నాటు వేయడమే పురుగు ఉధృతికి ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. నాటు వేసే ముందు వరి కొనలను కత్తిరించకపోవడంతోపాటు ఒకే రకమైన పంటలను సాగు చేయడం, యూరియా మోతాదు అధికంగా వాడటం కూడా పురుగు ఆశించడానికి ఓ కారణమని చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేర్లలో రెక్కల (మొగి) పురుగును పరిశీలించాలి. అయితే మొక్కను పీకిన తర్వాత కుళ్లిన వాసన వస్తే ఆశించిందని అర్థం చేసుకోవాలి. ఇది కాండంలోకి చొచ్చుకుని పోయి స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని నీరు, పోషక పదార్థాలు అందకుండా చేస్తుందని గుర్తించాలి. అయితే డిసెంబరు, జనవరి మొదటి వారం వరకు నాట్లేసిన వారికి ఎక్కువగా ఈ పురుగు ప్రభావం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలంటున్నారు.

నివారణ చర్యలిలా

యాసంగిలో వరి సాగులో పిలక దశలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దాని ఉధృతిని గమనించాలంటే పొలాల్లో దీపపు ఎరలను, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. లార్వా దశలో పైరుకు నష్ట పరిచే అవకాశం ఉంటే క్లోరోఫైరిఫస్‌ 20 ఈసీ ద్రావణంలో ఒక గంట పాటు నానబెట్టి నాటు వేసుకోవాలి. నాట్లు వేయకుంటే మాత్రం వారం ముందు నారుకు 800 గ్రాముల కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్‌ 0.3జీ గుళికలు చల్లాలన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులు నారు పోసే దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాట్లు వేసే సమయంలో వరి కొనలను కత్తిరించాలి. ఆదిలోనే గుర్తించి క్రిమి సంహారక మందులను పిచికారీ లేదా కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలను చల్లాలి. వాతావరణంలో మార్పులతో పాటు ఒకే రకమైన పంటలను సాగు చేయడమే పురుగు సోకడానికి కారణం అవుతుంది. ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి మొగి పురుగు నివారణపై సూచనలు ఇవ్వాలని ఇప్పటికే సూచించాం.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులకు బురిడీ

పార్ట్‌ టైం జాబ్‌ అంటూ డబ్బులు కాజేశారు

పటాన్‌చెరు టౌన్‌: పార్ట్‌ టైం జాబ్‌ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించి ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన అమీన్‌పూర్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బంధం కొమ్ముకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి పార్ట్‌ టైం జాబ్‌ అంటూ వాట్సాప్‌ మెసేజ్‌ డిసెంబర్‌ 11న వచ్చింది. అందులో తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్‌ నిర్వాహకులు అతడికి వాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. ముందుగా రూ.6 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేస్తున్నాడు. సైబర్‌ నేరగాళ్లు వాలెట్‌లో నగదు చూపిస్తున్నారు. మొత్తంగా బాధితుడు రూ.19 లక్షలు చెల్లించాడు. చివరిగా నగదుతో పాటు కమిషన్‌ ఇవ్వాలని అడగగా స్పందించ లేదు. తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌, అమీన్‌పూర్‌ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

కిష్టారెడ్డిపేటలో... అమీన్‌పూర్‌ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి ఈనెల 3న పార్ట్‌ టైం జాబ్‌ ఆఫర్‌ అంటూ మెసేజ్‌ వచ్చింది. అందులో తన వివరాలను నమోదు చేశాడు. ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.90 వేలు ఇన్వెస్ట్‌ చేశాడు. చివరికి మొత్తం తిరిగివ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌, అమీన్‌పూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్‌ నేరగాళ్ల మోసాలు

రూ.1,59,999 పోగొట్టుకున్న బాధితులు

సిద్దిపేటకమాన్‌: కమిషనరేట్‌ పరిధిలో సైబర్‌ నేరగాళ్ల బారిన పడి పలువురు డబ్బులు పోగొట్టుకున్నారు. మంగళవారం కేసుల వివరాలను సీపీ వెల్లడించారు. సిద్దిపేట రూరల్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో సెనీ ట్రేడర్‌ యాప్‌ లింకును ఓపెన్‌ చేసి వివరాలు నమోదు చేశాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో రూ.36,999 పంపించాడు. ..మద్దూర్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి.. సైబర్‌ నేరగాడు పంపిన మనీ డబ్బింగ్‌ పేజీని ఓపెన్‌ చేసి తద్వారా టెలిగ్రామ్‌ గ్రూప్‌లో జాయిన్‌ అయ్యాడు. ఈ యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మి ఆన్‌లైన్‌లో రూ.98,000 పంపించి మోసపోయాడు... సిద్దిపేట త్రీ టౌన్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి పార్ట్‌ టైం జాబ్‌ పేరుతో యూట్యూబ్‌ చానల్‌లో పెట్టుబడిగా పెట్టి సబ్‌స్క్రైబ్‌ చేస్తే డబ్బులు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి చెప్పాడు. బాధితుడికి మొదటగా రూ.50 లాభం వచ్చింది. ఎక్కువ మొత్తంలో వస్తాయని ఆశపడి ఆన్‌లైన్‌లో రూ.25వేలు పంపించాడు. తర్వాత ఆ లింకును ఓపెన్‌ చేస్తే బ్లాక్‌ చేసినట్లు మెసేజ్‌ కనిపిస్తోంది. కాగా, ఈ కేసుల్లోని బాధితులందరూ 1930కు ఫిర్యాదు చేశారని సీపీ తెలిపారు.

మటన్‌ కటింగ్‌ కోసం వచ్చి.. శవమై

సాకి చెరువులో మృతదేహం
గోల్కొండ వాసిగా గుర్తింపు

పటాన్‌చెరుటౌన్‌: మటన్‌ కటింగ్‌ కోసం వెళ్తున్నానని చెప్పిన వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. ఈ సంఘటన పటాన్‌చెరులో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ కురుషీద్‌ అలీ కథనం ప్రకారం.. సాకి చెరువులో ఉదయం మృతదేహం తేలిందని పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తే జేబులో ఆధార్‌ దొరికింది. దీంతో గోల్కొండలో నివాసం ఉండే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారొచ్చి మృతదేహాన్ని పరిశీలించి మహమ్మద్‌ ఖాజా మొయినుద్దీన్‌(49)గా గుర్తించారు. ఈనెల 2న ఇంటి నుంచి మటన్‌ కటింగ్‌ చేసేందుకు పటాన్‌చెరు వైపు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడని, ఎంతకీ తిరిగి రాకపోయే సరికే సోమ వారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు పెట్టామని చెప్పారు. తీరా ఇలా చెరువులో పడి మరణిస్తాడనుకోలేదని రోదిస్తున్నారు. అయితే సాకి చెరువులో తేలిన మృతదేహాన్ని పరిశీలిస్తే కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇది జరిగి కూడా మూడు రోజులై ఉండొచ్చంటున్నారు. ఖాజా భార్య కురూబి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

హత్య చేసి.. నదిలో పడేసి..

- తండ్రీకొడుకుల ఘాతుకం
- మంజీరాలో లభ్యమైన మహిళ మృతదేహం కేసు ఛేదన
- వివరాలు వెల్లడించిన సీఐ, ఎస్సై


నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయికోడ్‌(అందోల్‌): మంజీర నదిలో బయట పడిన గుర్తు తెలియని మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. ఇందులో భర్త, కొడుకే నిందితులని నిర్ధారించారు. జహీరాబాద్‌ రూరల్‌ సీఐ వెంకటేశం, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. సంగారెడ్డి మండలం పసల్‌వాది గ్రామానికి చెందిన దర్జి మల్లీశ్వరి(42) ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మతిస్థిమితం కోల్పోయింది. మూర్ఛ వ్యాధి కూడా ఉంది. ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇంట్లో భర్త, కుమారులు, చిన్న పిల్లలను కొరకడం, తిట్టడం, కొట్టడం చేస్తుంది. ఇవన్నీ భరించలేక అంతమొందిస్తే మిగిలిన కుటుంబసభ్యులైనా ప్రశాంతంగా జీవించొచ్చని భర్త సత్యనారాయణ, పెద్దకొడుకు ప్రవీణ్‌ భావించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం.. గత నెల 28న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆమె గొంతుకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహానికి రగ్గు చుట్టి బండరాయి కట్టారు. కారులో తీసుకెళ్లి సిరూర్‌ శివారులోని మంజీర నది వంతెన పైనుంచి కింద పడేశారు. తమకేమీ తెలియనట్లుగా స్వగ్రామానికి చేరుకున్నారు. రెండురోజుల తర్వాత భార్య కనిపించడం లేదని భర్త సంగారెడ్డి రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 4న రాయికోడ్‌ పోలీసులు గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సాంకేతిక ఆధారాలతో మల్లీశ్వరిగా గుర్తించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. ఆమెను హత్య చేసింది భర్త, కొడులేనని దర్యాప్తులో తేల్చారు. నిందితులిద్దరినీ మంగళవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌ పంపించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఇక్బాల్‌ హుస్సేన్‌, సిబ్బంది ఉన్నారు

హడలెత్తిస్తున్న దొంగలు

తిమ్మారెడ్డిపల్లి, తూప్రాన్‌లలో వరుస చోరీలు

- నగదు, బంగారం అపహరణ
- బెంబేలెత్తుతున్న ప్రజలు


తిమ్మారెడ్డిపల్లిలో ఓ ఇంట్లో దొంగలు తెరిచిన బీరువా

దొంగలు పేట్రేగిపోతున్నారు. వరుస చోరీలతో ప్రజలను హడలెత్తిస్తున్నారు. కొండపాక, తూప్రాన్‌ మండలాల్లో చోరీలు జరిగాయి.

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రోజురోజుకూ దొంగలు బెడదలు పెరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన చిలుముల కొండయ్య కుటుంబీకులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్ద పనులు చేసుకునేందుకు వెళ్లారు. మధ్యాహ్నం.. వేసిన తాళాలను దొంగలు పగలగొట్టి బీరువాలోంచి రూ. 3 లక్షలతో పాటు 2 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం పూట వస్తే ఇంటి తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూస్తే బీరువా సైతం తెరిచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 2న గ్రామంలోని రెండిళ్లలోంచి రూ.1.50 లక్షలతో పాటు 3 తులాల బంగారు ఆభరణాలు ఖరీదైన దుస్తులను ఎత్తుకెళ్లడం తెలిసిందే. వారం రోజుల వ్యవధిలో మూడిళ్లలో దొంగతనాలు జరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో దొంగతనం జరిగిన విషయాన్ని కుకునూరుపల్లి పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదూ అందలేదని తెలిపారు. వారు దొంగల బెడదలను అరికట్టాలని చూడాలని గ్రామస్తులు కోరారు.

రెండు దుకాణాల్లోనూ..

తూప్రాన్‌: రెండు దుకాణాల్లో చోరీ చేసి, మరో షాపులో విఫలయత్నం చేసిన ఘటన పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మన్నే కుమార్‌ మణికంఠ ట్రేడర్స్‌ షాపు నిర్వహిస్తున్నాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు పైకప్పు రేకులు తొలగించి కౌంటర్లో ఉన్న రూ.14 వేల నగదు, 20 తులాల వెండి విగ్రహాలను అపహరించుకు వెళ్లారు. అలాగే పక్కనే ఉన్న సంతోష్‌ కుమార్‌కు చెందిన నటరాజ్‌ ట్రేడర్స్‌ షాపు షట్టర్‌ పగలగొట్టి లోపలికి ప్రవేశించి రూ. 5వేల నగదు తీసుకెళ్లారు. ఈ దుకాణాల్లో సీసీ కెమెరాలకు చెందిన హార్డ్‌ డిస్కులను ఎత్తుకెళ్లారు. కాగా ఎదురుగా ఉన్న మరో దుకాణాల్లో చోరీకి యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం తూప్రాన్‌ సీఐ కృష్ణ, ఎస్సై శివానందం ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వారం రోజుల క్రితం ఓ సిమెంట్‌ దుకాణంలో ఏడు లక్షల నగదు చోరీ జరిగిన విషయం విదితమే. వరుస చోరీలు జరగడం పట్ల పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హార్వెస్టర్‌లో ఇక బియ్యం

పెద్దకోడూరు యువకుడి వినూత్న సృష్టి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈ యువకుడు.. హార్వెస్టర్‌ కం రైస్‌ మిల్లు నమూనా తయారు చేసి యువశక్తిని చాటాడు. బువ్వ కోసం రైతులు తీవ్ర వ్యయ ప్రయాసాలతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలకు తన ప్రయోగంతో సమాధానం చెబుతున్నాడు. కొంచెం అండగా నిలిస్తే రైతులకు ప్రయోజనకరమైన యంత్రాలు సృష్టిస్తానని అంటున్నాడు. అతనే పెద్దకోడూరు గ్రామస్తుడు అమరేందర్‌. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన లచ్చపేట శ్రీనివాస్‌, లక్ష్మిలది సామాన్య కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. పెద్దకుమారుడు అమరేందర్‌ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్‌ వరకు చదివి మధ్యలోనే చదువు నిలిపివేశాడు. మూడేళ్లుగా కరెంట్‌ మోటార్‌ వైండింగ్‌ షాపులో పని చేస్తున్నాడు. తన సంపాదనతో కుటుంబానికి బాసటగా నిలుస్తున్నాడు. అయినా తన మదిలో ఏదో ఒక తెలియని వెలితి. ఇలా మనం ఎంతకాలం పని చేయాలని ఆలోచించి వరి కోత మిషన్‌ తయారు చేశాడు. వడ్లను బియ్యంగా మార్చగలదు. ఏడాదిన్నర పాటు శ్రమించి రూ.25 వేలు ఖర్చు చేసి తయారు చేశాడు. ఇప్పుడు అది పలువురి ప్రశంసలను అందుకుంటోంది.


వరి కోత యంత్రంలో వడ్లు పోస్తున్న అమరేందర్‌

బంధువు చనిపోయాడని వెళ్తే.. ఇల్లు గుల్ల

రిమ్మనగూడలో ఘటన

గజ్వేల్‌రూరల్‌: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన మండల పరిధిలోని రిమ్మనగూడలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పోశి అయ్యలం తమ బంధువు చనిపోతే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి మండలం ఐనాపూర్‌ వెళ్లారు. రాత్రి ఇక్కడే ఉండి మంగళవారం వచ్చేసరికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది.. అందులోని 7.25తులాల బంగారు గొలుసులతో పాటు గంటీలు, ఉంగరం, మాటీలు, రూ. లక్షా 55 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

భరోసాలేని బతుకులు

కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న 450 సర్వశిక్షా అభియాన్‌ ఉద్యోగులు

- అదనపు బాధ్యతలతో సతమతం
- ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్‌

ఎస్‌ఎస్‌ఏలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సిబ్బంది వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కనీసవేతనాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు. పైగా అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా తమ శ్రమను గుర్తించడం లేదని వాపోతున్నారు. ఇదీ మునిపల్లి మండలంలోని పరిస్థితి.


మునిపల్లి ఎంఈఓ కార్యాలయం

మునిపల్లి(అందోల్‌): ఎస్‌ఎస్‌ఏ (సమగ్ర శిక్షా అభియాన్‌)లో సీఆర్‌పీలు(క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్‌), ఎంఐఎస్‌ (మండల ఇన్ఫర్మేషన్‌ సిస్టమ్‌)కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, మెసేంజర్స్‌(అంటెండర్స్‌) కాంట్రాక్టు పద్ధతిన 2003 నుంచి పనిచేస్తున్నారు. 85 పాఠశాల క్లస్టర్లకు గాను 107 మంది సీఆర్‌పీలు, ఎంఐఎస్‌ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసేంజర్లు పని చేస్తున్నట్లు రికార్డుల్లో ఉంది. ఈ వ్యవస్థ 2001 నుంచి ప్రారంభమైంది. సీఆర్‌పీలు మండలానికి నలుగురి నుంచి ఐదుగురి వరకు ఉంటారు. అయితే క్లస్టర్‌కు ఒకరు చొప్పున ఉంటారు. ఎంఐఎస్‌లు ఎంఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తారు. ఎంఈఓ ఎక్కడివెళ్తారో అక్కడి వెళ్లి ఆయన చెప్పేవన్నీ రికార్డు చేస్తారు. ఆపై డేటా ఎంట్రీ చేయిస్తారు. ఇక్కడే డేటా ఎంటీ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తారు. సీఆర్‌పీలు పని చేసే చోటనే మెసేంజర్స్‌ కూడా ఉంటారు. అందరూ సైతం ఉదయాన్నే 8 గంటలకు వెళ్లి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తారు. సీఆర్‌పీలు, ఎంఐఎస్‌లు ఎప్పటికప్పుడూ పాఠశాలలను తనిఖీ చేస్తారు. విధులకు ఉపాధ్యాయులు గైర్హాజరైతే వీరే బోధన చేస్తారు. రోజూ ఎంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చారనే వివరాలూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. విద్యార్థులు పరీక్షకు అవసరమైన ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలను అందజేస్తారు. పాఠశాలల పరిశీలన, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తారు. ప్రస్తుతం టెన్త్‌ పరీక్షలు దగ్గర పడటంతో అందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండాల్సిందేనని తెలుస్తోంది.

డిమాండ్లు ఇవే..

కాగా వారందరూ కూడా కనీస వేతనాలు రూ.45 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలని, రెగ్యులరైజ్‌, టీఏలు, డీఏలు మంజూరు చేయాలంటున్నారు. ఆరోగ్య భద్రతను కల్పించాలంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు తమకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేస్తున్నారు. అయితే ప్రతి సంవత్సరం ఉద్యోగంలో కొనసాగాలంటే ప్రతి ఏడాది మార్చి నెలలో సరిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుందని వాపోతున్నారు. ఈ నిబంధనను ఎత్తేయాలంటున్నారు. కాగా, ఎస్‌ఎస్‌ఏ సంఘం వారి తరఫున తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

నిబంధనల ప్రకారమే



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎస్‌ఎస్‌ఏ సిబ్బందికి వేతనాలు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తే అప్పుడే వారివారి అకౌంట్లలో డబ్బులు జమ చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ